


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 112 | బుధవారం 23 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-

# జూరాలకు నీళ్లివ్వండి..

# కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్

- జూరాలకు 5 టీఎంసీల నీరు ఇవ్వాలని కోరిన రేవంత్
- నీటి విడుదలకు శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం
- బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ
- విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి
- జూరాల నీటి కోసం రైతుల ఆందోళన



## తిరువూరులో సీడ్ యాక్సిస్ రోడ్ల తరహాలో అభివృద్ధికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన



- తిరువూరులో మధిర ప్రధాన రహదారి ఆధునికీకరణ పనులకు శ్రీకారం
- రూ. 14 కోట్ల పనులకు వర్చువల్ గా శంకుస్థాపన చేసిన చంద్రబాబు
- ప్రత్యక్షంగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కొలికపూడి

# అమెరికాకు ఇరాన్ కీలక ఆఫర్..

# దిగొచ్చిన చమురు ధరలు

- హర్మూజ్ జలసంధి తెరవడానికి సిద్ధమన్న ఇరాన్
- అమెరికా సైనిక ఒత్తిడి తగ్గించాలని షరతు
- పోర్టుల దిగ్బంధనం ఎత్తివేయాలని డిమాండ్
- మధ్యవర్తుల ద్వారా అమెరికాకు ప్రతిపాదన
- చమురు ధరలు 99 డాలర్ల దిగువకు పతనం



## న్యూయార్క్‌లో ఐరాస సమావేశానికి ఇరాన్ అధ్యక్షుడు... అమెరికా ఆంక్షల వలయం

అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ న్యూయార్క్‌లో అడుగు పెట్టారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనపై, ఆతిథ్య దేశమైన అమెరికా కఠినమైన ప్రయాణ ఆంక్షలు విధించింది. ఆయన తన ప్రతినిధి బృందంతో కలిసి, తాము బస చేసిన మాన్‌హాటన్ లోని మిలీనియం హిల్టన్ హోటల్ నుండి ఐరాస ప్రధాన కార్యాలయానికి మాత్రమే



## సీఎం రేవంత్ చేతకానితనం వల్లే ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదం



ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి ప్రమాదం పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ముగ్గురు చిన్నారులు మృతిచెందడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. ఈ ప్రమాదంలో మరో 23 మంది చిన్నారులు గాయపడ్డారని ,వారికి వెంటనే మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు

## డేట్, టైమ్ ఫిక్స్ చేసుకొని మాట్లాడుకుందాం..



ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీలోనే కాదు.. అండమాన్, ఆస్ట్రేలియాలో ఉన్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరించారు. తనపై కోపం ఉంటే నేరుగా తనతో తేల్చుకోవాలని అన్నారు. – మిగతా2లో

## బొల్లారం ఆయుధాల చోరీ కేసు.. వెలుగులోకి సంచలన విషయాలు



బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ కేసులో నిందితుడు మల్లేష్‌ను విచారించిన పోలీసులు.. అతడి నుంచి పలు సంచలన విషయాలు రాబట్టారు. నాలుగు నెలల ముందే అతడు ఈ ఆయుధాల చోరీకి పథక రచన చేసినట్లు బొల్లారం పోలీసులు గుర్తించారు. – మిగతా2లో

# ఆ నోటీసులకు కారణం ఏంటి..

# ఈసీకి సుప్రీం ప్రశ్న

ఢిల్లీ సర్ ప్రక్రియలో భాగంగా లాజికల్ డిస్క్రిపెన్సీస్ కేటగిరీ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులపై సుప్రీం కోర్టు ఈసీ పై పలు ప్రశ్నలు సంధించింది. ఏ ప్రాతిపదికన ఈ నోటీసులు జారీ చేస్తున్నారని ఈసీని ప్రశ్నించింది. ఈ కేటగిరీ పై స్పష్టత ఇవ్వాలని చెప్పింది. – మిగతా2లో



## విజయవాడ ఘటనతో సంబంధం లేని 250 మందికి పైగా వైసీపీ నేతల పై కేసులు పెట్టారు

- డీఎస్సీ అక్రమాలపై నిరసన తెలిపిన వారి పై కేసులు పెట్టారన్న అంబటి రాంబాబు
- ఇది ముమ్మాటికీ రాజకీయ కక్షసాధింపు వ్యవహారమే అని విమర్శ
- పోలీసులు మఫ్టీలో వచ్చి వైసీపీ నేతలను లాక్కెల్లారని మండిపాటు



VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

# జూరాలకు నీళ్లివ్వండి.. కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు. జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు. జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

# తిరువూరులో సీడ్ యాక్సిస్ రోడ్ల తరహాలో అభివృద్ధికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. తిరువూరు పట్టణంలోని మధిర ప్రధాన రహదారి ఆధునీకరణ, విస్తరణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' విధానంలో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. సచివాలయం నుంచి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయగా, స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు మధిర రోడ్డు వద్ద ప్రత్యక్షంగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ... హైదరాబాద్‌లోని ప్రపంచ స్థాయి ఐఎస్‌బీ రోడ్లు, రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సిస్ రోడ్ల నమూనాలో తిరువూరు మధిర రహదారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ రూ.14 కోట్ల ప్రాజెక్టు పూర్తయితే తిరువూరు పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని... ప్రయాణికులు, స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఏ. కుమార్, మున్సిపల్ కమిషనర్ కె. మనోజ్, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ చేతకానితనం వల్లే ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదం

ఈ ప్రమాదంలో మరో 23 మంది చిన్నారులు గాయపడ్డారని, వారికి వెంటనే మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. అభంశుభం తెలియని పిల్లలు అన్యాయంగా బలైపోయారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ వైద్య రంగాన్ని రేవంత్ రెడ్డి పూర్తిగా విధ్వంసం చేశారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఈ సంఘటనకు ఆయనే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో నెలకొన్న దుస్థితులపై అనేకసార్లు జిల్లా స్థాయి బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారని తెలిపారు. అయినా మొద్దు నిద్ర వీడని రేవంత్ సర్కార్‌లో కనీస చలనం కనిపించలేదన్నారు. అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన పిల్లల వార్డులో ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని ఆరోపించారు. కనీస నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందని కేటీఆర్ ఆగ్రహించారు. ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను వెంటనే నిపుణులతో తనిఖీ చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ప్రతి కుటుంబానికీ రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున కేటీఆర్ డిమాండ్ చేశారు.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసు.. వెలుగులోకి సంచలన విషయాలు

నాలుగు నెలల ముందే అతడు ఈ ఆయుధాల చోరీకి పథక రచన చేసినట్లు బొల్లారం పోలీసులు గుర్తించారు. ఆదివారం.. సెలవు దినం కాబట్టి ఆ రోజే ఆయుధాలను చోరీ చేయాలని అతడు ముందుగా ప్లాన్ వేశాడని తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం రోజు గార్డ్ ఇన్‌చార్జ్‌లు, ఆర్మీ అధికారుల కదలికలు తక్కువగా ఉంటాయని అతడు గుర్తించి.. ఈ నిర్ణయం తీసుకున్నాడని వివరించారు. దీంతో ఆ రోజే ఆయుధాల చోరీకి అతడు స్కెచ్ వేశాడని చెప్పారు. అలాగే చోరీ చేసిన ఆయుధాలను సంఘ విద్రోహశక్తులకు విక్రయించాలని మల్లేష్ భావించాడని పోలీసులు పేర్కొన్నారు. అందుకోసం ఆయుధాలు కొనుగోలు చేసే వ్యక్తుల కోసం సోషల్ మీడియాలో అతడు తీవ్రంగా వెతికినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. తద్వారా వచ్చిన నగదుతో తన ఆర్థిక నష్టాలను పూడ్చుకోవాలని మల్లేష్ నిర్ణయించాడని అన్నారు. మూడేళ్ల పాటు సర్వీస్ ఉన్నప్పటికీ.. విధుల నుంచి తొలగించడంతో ఆర్మీ అధికారులపై మల్లేష్ కక్ష పెంచుకున్నాడని తెలిపారు. దీంతో మద్రాస్ బెటాలియన్ నుంచి ఆయుధాలు చోరీ చేయడం ద్వారా ఆ అధికారుల ప్రతిష్ఠ దెబ్బతీయాలని మల్లేష్ ఈ పథకం వేశాడని వివరించారు. దాదాపు 16 ఏళ్ల పాటు మద్రాస్ రెజిమెంట్‌లో మల్లేష్ విధులు నిర్వహించాడని పోలీసులు చెప్పారు. ఆ అనుభవంతోనే ఆయుధాలు చోరీ చేసినట్లు తమ దర్యాప్తులో గుర్తించామని పేర్కొన్నారు. ఇక ఆర్మీలో తన స్నేహితులు ఇన్‌చార్జ్ నాయక్ వినోద్, మ్యాగజైన్ ఇన్‌చార్జ్ బల్లి మధు, గార్డ్ ఇన్‌చార్జ్ హవాల్దార్ కేవీ రమణతోపాటు క్వార్టర్ గార్డ్ ఇన్‌చార్జ్ నిరేష్‌తో మల్లేష్ తరచూ ఫోన్ కాల్స్ మాట్లాడినట్లు గుర్తించామని పోలీసులు వివరించారు.

# ఆ నోటీసులకు కారణం ఏంటి.. ఈసీకి సుప్రీం ప్రశ్న

సర్ నోటీసులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాలని ఈసీని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాలా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఢిల్లీ సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. సర్ ప్రక్రియ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల్లో స్పష్టమైన కారణాలు పేర్కొనట్లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషన్ పేర్కొన్నారు. ఏ ప్రాతిపదికన ఓటర్లకు లాజికల్ డిస్క్రిపెన్సీ కేటగిరీ కింద నోటీసులు జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. ఓటర్ల నుంచి ఏయే పత్రాలు, వివరాలను ఈసీ ఆశిస్తున్నదో కూడా స్పష్టత లేదని అన్నారు. సాధారణ ఓటర్ల వద్ద పరిమితమైన డాక్యుమెంట్స్ మాత్రమే ఉంటాయని చెప్పారు. చాలామంది దగ్గర ప్రాథమిక వివరాలున్న ప్రధాన డాక్యుమెంట్‌గా ఆదార్ కార్డు మాత్రమే ఉంటోందని చెప్పారు. ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా ప్రజలు అప్పటికే వయసు, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన నేపథ్యంలో మళ్లీ అదనపు వివరాల నిర్ధారణకు డాక్యుమెంట్స్ ఎందుకు సమర్పించాలని ప్రశ్నించారు. నివాసం మార్పు పేరిట ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి అనేక మంది పేర్లు తొలగించారని చెప్పారు. ఇందుకు అనుసరించిన పద్ధతిపై సందేహాలు లేవనెత్తారు. ఈ విషయాలపై ఈసీ తరఫున సీనియర్ అడ్వొకేట్ డీఎస్ నాయుడు వాదనలు వినిపించారు. ప్రతి నోటీసుకు వెనక గల కారణాన్ని ఈసీ పేర్కొంటుందని ఆయన చెప్పారు. పిటిషనర్లు లెవనెత్తున్న అంశాలు వారు భావిస్తున్నంత తీవ్రమైనవి కావని అన్నారు. మరోవైపు సర్ ప్రక్రియ డెడ్‌లైన్‌ను అవసరమనుకుంటే పొడిగించేందుకు ఈసీ సుముఖంగానే ఉందని కూడా చెప్పారు. చట్టంలో పేర్కొన్న ప్రక్రియకు భిన్నంగా ఒక్కరి ఓటు కూడా తొలగించబోమని హామీ ఇచ్చారు.

## అమెరికాకు ఇరాన్ కీలక ఆఫర్.. దిగొచ్చిన చమురు ధరలు

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రతిపాదన చేసింది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధమని తెలిపింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ ఇరాన్ అధికారి వెల్లడించినట్లు రాయిటర్స్ తెలిపింది. మధ్యవర్తుల ద్వారా ఈ ప్రతిపాదనను అమెరికాకు చేరవేసినట్లు సమాచారం. అమెరికాతో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు ఈ ప్రతిపాదనతో సంకేతాలు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా న్యూయార్క్‌లో మధ్యవర్తి దేశాలతో ఈ అంశంపై చర్చించాలని టెహ్రాన్ భావిస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య భేటీ ఉండబోదని ఇరాన్ అధికారి తెలిపారు. అయితే అమెరికా నిబద్ధత చూపితే ఒప్పందం దిశగా వెళ్లే అవకాశం ఉందన్నారు. హర్మూజ్ జలసంధికి సంబంధించిన సైనిక చర్యలను అమెరికా నిలిపివేయాలని ఇరాన్ కోరుతోంది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, ఇరాన్ పోర్టులపై ఆంక్షలు ఎత్తివేస్తే జలసంధిని తిరిగి తెరిచి చర్చలను కొనసాగిస్తామని టెహ్రాన్ చెబుతోంది. పోర్టులపై ఆంక్షలు ఇరాన్ ముడిచమురు ఎగుమతులు, సముద్ర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. చర్చలను పునరుద్ధరించేందుకు ఇరాన్ గతంలో ఏడు షరతులను కూడా వెల్లడించింది. హర్మూజ్ ద్వారా ముడి చమురు సరఫరా లో అంతరాయాలపై ఆందోళనలు తగ్గడంతో ధరలు దిగివచ్చాయి.

### న్యూయార్క్‌లో ఐరాస సమావేశానికి ఇరాన్ అధ్యక్షుడు... అమెరికా ఆంక్షల వలయం

ఆయన తన ప్రతినిధి బృందంతో కలిసి, తాము బస చేసిన మాన్‌హాటన్ లోని మిలీనియం హిల్టన్ హోటల్ నుండి ఐరాస ప్రధాన కార్యాలయానికి మాత్రమే ప్రయాణించాలని స్పష్టం చేసింది. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం, పెజెష్కియాన్ బృందం ప్రత్యేక అనుమతి లేకుండా న్యూయార్క్ లోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వీల్లేదు. ఇరాన్ దౌత్యవేత్తలపై ఇటువంటి ఆంక్షలు 2024 నుండి అమలులో ఉండగా, గతంలో ట్రంప్ హయాంలో వాటిని మరింత కఠినతరం చేశారు. దాదాపు ఏడు నెలలుగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, 1947 ఐరాస ఒప్పందం ప్రకారం సభ్య దేశాల ప్రతినిధులను అనుమతించాల్సిన బాధ్యత అమెరికాపై ఉంది. ఈ వారం జరగనున్న ఐరాస సమావేశంలో పెజెష్కియాన్ ప్రసంగించనున్నారు. తమ దేశంపై దాడులు జరిగాయని, తమ చర్యలు కేవలం ఆత్మరక్షణ కోసమేనని ఆయన వాదించే అవకాశం ఉంది. ఈ పర్యటనలో భాగంగా అమెరికా, యూరప్ థింక్ ట్యాంక్ విశ్లేషకులతో సమావేశమయ్యేందుకు కూడా ఆయన ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, డొనాల్డ్ ట్రంప్ కూడా పెజెష్కియాన్‌తో భేటీకి సిద్ధంగా ఉన్నట్లు సూచనప్రాయంగా తెలిపినప్పటికీ, అధికారికంగా ఎలాంటి చర్చల ప్రణాళిక సిద్ధం కాలేదు. ఇరు దేశాల మధ్య అర్థవంతమైన చర్చలు జరగాలంటే అవి న్యూయార్క్ వెలుపల జరగడమే శ్రేయస్కరమని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ అభిప్రాయపడ్డారు.

## విజయవాడ ఘటనతో సంబంధం లేని 250 మందికి పైగా వైసీపీ నేతలపై కేసులు పెట్టారు

విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన వైసీపీ నేతలపై కేసులు పెట్టారంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... డీఎస్సీ అక్రమాలపై శాంతియుతంగా నిరసన తెలిపిన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కావాలనే దాడులు చేయించి, రివర్స్ లో అక్రమ కేసులు బనాయించిందని మండిపడ్డారు. విజయవాడ ఘటనతో ఏమాత్రం సంబంధం లేని 250 మందికి పైగా వైసీపీ నాయకులపై భిన్నమైన తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం ముమ్మాటికీ కక్షసాధింపు రాజకీయమేనని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ల దిశానిర్దేశంలోనే ఈ అక్రమ కేసుల పర్వం నడుస్తోందని అంబటి రాంబాబు విమర్శించారు. ఘటన సమయంలో విజయవాడలోనే లేని వారిపై కూడా కేసులు పెట్టారని, రాత్రికి రాత్రే నోటీసులు కూడా ఇవ్వకుండా మఫ్టీలో వచ్చి వైసీపీ నాయకులను లాక్కెళ్లడం పోలీసుల దుర్మార్గానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అధికారం శాశ్వతం కాదని, పోలీసు వ్యవస్థను వాడుకుంటూ అన్యాయంగా ప్రవర్తిస్తున్న నారా లోకేశ్, అందుకు సహకరిస్తున్న అధికారులకు రాబోయే రోజుల్లో చట్టం పదునేంటో చూపిస్తామని, న్యాయస్థానాల ద్వారా చట్టపరమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# డేట్, టైమ్ ఫిక్స్ చేసుకొని మాట్లాడుకుందాం..

తమది నీతి, నిజాయతీలతో బతికిన కుటుంబమని లోకేశ్ అన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53 రోజులు జైలులో పెట్టారని చెప్పారు. ఆయనపై పెట్టిన ఒక్క కేసు కూడా నిలబడలేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు ఎందుకు భయపడతామని ప్రశ్నించారు. జగన్‌పై విమర్శలు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**డీఎస్సీపై వైసీపీ 300 కేసులు**

ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ ప్రకటించలేదని, ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని లోకేశ్ విమర్శించారు. బాబు తొలి సంతకం డీఎస్సీపైనే చేశారని తెలిపారు. దాన్ని ముందుకు సాగనీయకుండా వైసీపీ నాయకులు 300 కేసులు వేశారని చెప్పారు. 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని పేర్కొన్నారు. వారికి అమరావతిలో అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని అన్నారు.

**జగన్‌పై లోకేశ్ తీవ్ర వ్యాఖ్యలు**

అబద్ధానికి ప్యాంటు, షర్టు వేస్తే వచ్చే రూపమే జగన్ అంటూ లోకేశ్ వ్యాఖ్యానించారు. నిజం చెబితే తల వెయ్యి ముక్కలు అవుతుందనే శాపం ఆయనకు ఉందంటూ విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు వచ్చి డీఎస్సీలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారని చెప్పారు.

**టీడీపీకి సేవే లక్ష్యం**

టీడీపీలో తెలుగు యువత, తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి వంటి అనుబంధ విభాగాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తమ నాయకత్వ లక్ష్యమని చెప్పారు. పరిటాల శ్రీరామ్ లాంటి యువ నాయకత్వం పార్టీలో ఉందన్నారు. వైసీపీ నాయకత్వానికి, టీడీపీ నాయకత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఎన్టీఆర్, చంద్రబాబు నేర్పిన క్రమశిక్షణతోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు.

**పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం**

కార్యకర్తే అధినేత నినాదాన్ని ఆచరణలో అమలు చేస్తున్నామని లోకేశ్ చెప్పారు. కార్యకర్తల త్యాగాలను చంద్రబాబు మరువరని అన్నారు. కార్యకర్తల కోసం ప్రమాద బీమా తీసుకొచ్చామని తెలిపారు. రూ.175 కోట్లు కార్యకర్తలకు అందించి ఆదుకున్నామని చెప్పారు. కార్యకర్తల ఆరోగ్యాన్ని చూసుకునే బాధ్యత తనదేనని పేర్కొన్నారు.

**పనిచేస్తే పదవులు వస్తాయి**

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తిస్తామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తలు తాము చేస్తున్న కార్యక్రమాలను మై టీడీపీ యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రజల చుట్టూ తిరిగితే పదవులు వెదుక్కుంటూ వస్తాయని అన్నారు. పనిచేయకుండా పదవులు రావాలంటే కుదరదని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

**అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం**

కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తూ వెళ్తోందని లోకేశ్ చెప్పారు. అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం అందజేస్తామని తెలిపారు. ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి నిధులు కేటాయిస్తామని అన్నారు. రాప్తాడు ప్రాంతానికి పరిశ్రమలు, ఉద్యోగాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడులు తీసుకురావడంలో స్థానిక నాయకత్వానికి కూడా బాధ్యత ఉందని చెప్పారు.

# సంపాదకీయం

## ఈ తలకిందుల చదువును సరిచేసేదెవరు?



రైతులకు ఏ ఎరువులు వాడాలో, ఏ పురుగుల మందు ఎంత మోతాదులో వెయ్యాలో చెప్పడానికి ప్రతి గ్రామంలోనూ నిపుణుల్ని నియమిస్తామన్నది ఇటీవల తెలంగాణ ప్రభుత్వం. ఆ నిపుణులకు ఏ ఆరు నెలలో శిక్షణ ఇచ్చి నియమిస్తారు.మరి ఈ నిపుణులకు ఆరు నెలల్లో ఇవ్వగలిగిన పరిజ్ఞానాన్ని రైతులే పాఠశాల విద్యార్థులుగా ఉన్నప్పుడు, ఆ పదేళ్ల చదువులో ఎందుకు ఇవ్వలేకపోయారు? లోతైన క్లిష్టమైన థియరీ అంతా పాఠశాల, ఇంటర్ స్థాయిల్లో పెట్టి, నిత్య జీవితంలో అన్వయించుకోగల విద్యను మాత్రం పైస్థాయి కోర్సుల్లో బోధించే తలకిందుల చదువు వల్ల ఏం ప్రయోజనం? మెకాలే విద్యావిధానాన్ని నిర్మూలించాలని అరవయ్యేళ్లుగా నినదిస్తున్నాం. కానీ ఎలా మార్చాలో, దాని స్థానంలో ఏం ప్రవేశపెట్టాలో ఎవరూ చెప్పడం లేదు. కౌమారంలోని పిల్లలు వందల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకొనే దయనీయమైన, వికృతమైన వ్యవస్థను మాత్రం తయారుచేశాం. 'చదువు అంటే ఒక ఆనందమైన అనుభూతి కదా! జ్ఞానార్జన ఒక గొప్ప జీవితానుభవం కదా' అని ప్రొఫెసర్ హరగోపాల్ రాశారు. చదువు అంటే ఒక ఆనందమైన అనుభూతి అని భావించే ఒక్క విద్యార్థినైనా మన తెలుగు రాష్ట్రాల్లో ఎవరైనా చూపించగలరా? పాఠశాల స్థాయి పిల్లల ఆనందాన్ని కబళించే ప్రధాన శత్రువు అధిక చదువు. ఒకటో తరగతి విద్యార్థికి మూడు భాషలు నేర్పాలన్న నిర్ణయం తీసుకున్నప్పుడే మన పాలకులకు విద్యావ్యవస్థపై ఎంత అవగాహన ఉన్నదో అర్థం అవుతుంది! ప్రపంచంలో ఎక్కడైనా ప్రాథమిక విద్యార్థులకు మాతృభాష మాత్రమే నేర్పుతారు. ఇతర భాషలు నేర్చుకోవాలనుకొనేవారు డిగ్రీ స్థాయిలో వారికి ఇష్టమైన భాషలు నేర్చుకుంటారు. ఒక భాషను నేర్చుకుంటున్నామంటే అందులో కనీసం మాట్లాడటం, రాయడం రావాలి కదా! ఇందులో ఎంతవరకు విజయం సాధించాం? ఒకటో తరగతి నుంచి డిగ్రీ రెండో సంవత్సరం వరకు ఇంగ్లీషును ఒక సబ్జెక్టుగా 14 సంవత్సరాలు చదివిస్తున్నాం, పరీక్షలు పెడుతున్నాం. అయినా ఆ భాషలో ఒక వాక్యం సొంతంగా రాయడం కానీ, మాట్లాడటం కానీ చేయలేకపోతున్నారు. మరి ఈ కాలాన్ని ఎందుకు వృథా చేసినట్లు? అసలు భాష నేర్చుకోవటంలోని ప్రాథమిక లక్ష్యమైన అభివ్యక్తీకరణ రానప్పుడు దాన్నెందుకు చదివిస్తున్నాం? తల్లిదండ్రులు ఇంగ్లీషు మీడియం పాఠశాలల వైపు ఆకర్షితులవటానికి ప్రధాన కారణం ఇంగ్లీషులో మాట్లాడగలగటమే కదా. ఆ పని తెలుగు మీడియంలో కూడా చేయగలిగితే, ఒకటో తరగతి నుంచే పరాయి భాషలో అర్థం అయ్యి, అవ్వకుండా బట్టీలు పట్టే క్షోభ పిల్లలకు ఉండదు. హిందీ పరిస్థితి కూడా ఇంతే. పెద్దయిన తరువాత నాలుగైదు నెలల్లో నేర్చుకోగలిగిన భాషను చిన్న పిల్లలకు పదేళ్ల పాటు బోధించి హింసించటమెందుకు? అసలు చిన్న పిల్లలకు మూడు భాషలు నేర్పడమేమిటి? వీటిలో రెండు భాషలు తగ్గినట్లయితే పిల్లలపై ఎంత బరువు తగ్గేదో ఆలోచించండి. దశాబ్దాల పాటు ప్రయోజనమేమీ కలగజేయని ఈ భాషా విధానాన్ని వెంటనే మార్చేయాలి. జీవశాస్త్రాన్ని హైస్కూలు నుంచి ఇంటర్ వరకు తీసుకుంటే ఇందులో ముఖ్యంగా జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం ఉంటాయి. జంతుశాస్త్రం లో వెన్నెముక గల జీవులు (కార్డేటా), వెన్నెముక లేని జీవులు, ఏకకణ జీవులు, బహుకణ జీవులు, ఇతర లక్షణాల ఆధారంగా వాటి వర్గీకరణ, ప్రోటోజోవా, పొరిఫెరా, ఆర్థోపోడా, ఎకైనోడెర్మేటా వంటి ఫైలాల నుంచి సబ్‌ఫైలాలు, వాటి కుటుంబాలు చివరికి ఆయా జాతుల వరకు వందలాది నామాలు, వాటి సాధారణ లక్షణాలు, బాక్టీరియా, వైరస్, జెనెటిక్స్, జెనెటిక్ కోడ్‌లు, కణాలు, వాటి నిర్మాణం, కణ విభజన, వివిధ వ్యవస్థల నిర్మాణం, పనితీరు... ఇలా ఉన్నతస్థాయి జీవశాస్త్రం అంతా చదివేస్తారు. ఇందులో ఏ జీవీ మనకు బయట కనిపించదు. మైక్రోస్కోపులో చూడాల్సిందే. జీవులను కానీ, అంతర్గత వ్యవస్థలను కానీ, కేవలం ఊహించుకోవలసి రావటం వల్ల అవి అర్థం కావు, నిత్యజీవితంలో ఉపయోగపడవు కాబట్టి ఆసక్తి కలగదు. క్లిష్టమైన లాటిన్ పేర్లు గుర్తుండవు. ఇవన్నీ బట్టీ పట్టి, ఇంత విశదంగా నేర్చుకుంటారు సరే... కానీ, ఇంటర్ చదివి వ్యవసాయం చేయదలుచుకున్న విద్యార్థికి పశువులను ఎలా పెంచాలో, వాటికి వచ్చే జబ్బులు ఏమిటో, అవి రాకుండా ఏమి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియదు. గేదెలకు ఏమి ఆహారంగా పెడితే ఎక్కువ పాలిస్తాయో, గొర్రెలను ఎలా కాపాడుకోవాలో, చేపల పెంపకం, పట్టు పురుగులు... ఏమీ తెలియదు. ఇవన్నీ వెటర్నరీ డాక్టరు కోర్సులో ఉంటాయి. మరి మనం పైన చెప్పుకున్న జంతుశాస్త్రమంతా దేనికొరకు చదివినట్లు? లోతైన, క్లిష్టమైన థియరీ అంతా పాఠశాల, ఇంటర్ స్థాయిలో పెట్టి, నిత్య జీవితంలో అన్వయించుకోగల (అప్లికేషన్) విద్యను మాత్రం పై కోర్సులో పెట్టారు. నిజానికి అప్లికేషన్ కింది స్థాయిలో బోధించినట్లయితే... రోజూ చూసే జీవుల విషయం కాబట్టి విద్యార్థులు ఆసక్తితో చదువుతారు. పదో తరగతిలో చదువు మానేసినా అప్పటి వరకూ చదివిన చదువు నిత్య జీవితంలో ఉపయోగపడుతుంది. ఆసక్తి ఉన్నవారు పై చదువులకు వెళ్లి లోతుగా చదువుకుంటారు. ఇక్కడ చదవవలసింది అక్కడ, అక్కడ చదవవలసింది ఇక్కడ! ఇదీ మన తలకిందుల చదువు. వృక్షశాస్త్రంలో కూడా ఇంతే. వరి ఎన్ని రోజుల పంటో, నారుమడి చల్లి... నాట్లు ఎందుకు వేస్తారో, వరికి వచ్చే రోగాలేమిటో, వాటిని ఎలా అరికట్టాలో ఎవ్వరికీ తెలియదు.

# ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్లో “ శక్తి యాప్ పై అవగాహన







**– చదువుతోపాటు విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించుకోవాలి**
**– పాములపాడు ఏఎస్ఐ షేక్. నూర్ అహ్మద్**

సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం

చదువుతోపాటు విద్యార్థినీ విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించుకోవడం లో ముందుండాలని శక్తి టీం పాములపాడు ఏఎస్ఐ షేక్. నూర్ అహ్మద్ అన్నారు మంగళవారం పట్టణంలోని నంద్యాల జిల్లా ఎస్పి సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజనల్ అధికారి ఆర్.రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు మరియు ఆత్మకూరు అర్బన్ సీఐ,ఓ. మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో ఆత్మకూరు “శక్తీ టీం“ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు దేవానంద్, ఆధ్వర్యంలో మరియు పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సుమారు 200 మంది పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు “ శక్తీ యాప్ లో భాగంగా మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన “ శక్తి యాప్ “ గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ..ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,ఏపీకే ఫైల్స్ లాంటివి ఏదన్నా మీ పేరెంట్స్ సెల్ ఫోన్ వాట్సప్ లకు ఎవరైనా లింక్ మెసేజ్లు పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. మీ ఇండ్లకు పోయిన తర్వాత మీ పేరెంట్స్ యొక్క ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలలో శక్తీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని అత్యవసర సమయాలలో శక్తీ యాప్ ను ఎలా వాడాలి, దానీ ఉపయోగాల గురించి తెలుపడమే కాకుండా మీరు మంచి క్రమశిక్షణ తో మెలుగుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ ఆడపిల్లలను “ ఈవిటీజింగ్ “ పేరుతో ఎవరైనా ఆకతాయిలు అల్లరి పట్టించడం లాంటివి చేస్తే ఏ మాత్రం అధైర్య పడకుండా మీకు రక్షణ గా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తీ యాప్ ను ఉపయోగించి 112కు గానీ 1098కి గానీ ఫోన్ చేసి సహాయం పొందవచ్చు అని తెలియజేశారు. అదేవిధంగా 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మైనర్ విద్యార్థులు ఎవరు కూడా మోటార్ సైకిల్ ను నడపకూడదని సూచించారు చదువు మీద ధ్యాస పెట్టి బాగా కష్టపడి చదివి మీ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని. చదువు ఒక్కటే మిమ్మల్ని సమాజంలో గౌరవాన్ని, మర్యాదను, హుందాతనాన్ని తీసుకొచ్చి మీ తలరాతలను మార్చేది చదువు ఒక్కటే అని తెలిపారు .. అదేవిధంగా మీ ఇంట్లోని మీ పేరెంట్స్ మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు రక్షణగా “ హెల్మెట్ “ పెట్టుకొని ప్రయాణం చేయాలని హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను తెలిపి మరియు ఎవ్వరూ కూడా మీ ఇంట్లోని వారు నాన్న,అన్నా,బాబాయి,మేనమామ లు ఎవ్వరైనా సరే మద్యం త్రాగి వాహనాలను నడపవద్దని చెప్పమని సూచిస్తూ త్రాగి వాహనం నడిపితే కోర్టు వారు 10 వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను విధిస్తారు అంటూ విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థినీలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాలో ఆరు మున్సిపాలిటీల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.164 కోట్ల కేటాయింపు





**– రూ.550 కోట్లతో నంద్యాల పట్టణ రూపురేఖల్లో సమగ్ర మార్పు**
**– నంద్యాల పట్టణాన్ని స్వచ్ఛ ఆరోగ్యకర నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**

నంద్యాల, సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం

నంద్యాల జిల్లా సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ మరియు నంద్యాల మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి రాజ కుమారి గణియా తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణ మున్సిపల్ టౌన్ హాల్ నందు ఏర్పాటు చేసిన హైబ్రిడ్ మాన్యుటి మోడల్ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా రూ.164 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు గౌ. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి శంకుస్థాపన చేయనున్న కార్యక్రమానికి జిల్లా నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ప్రజా ప్రతినిధులు తదితర అధికారులు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం కింద జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలకు రూ.164 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, ఈ అభివృద్ధి పనులకు గౌరవ ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారన్నారు. నంద్యాల పట్టణం: రూ.63 కోట్లు డోన్ మున్సిపాలిటీ: రూ.21 కోట్లు ఆళ్లగడ్డ మున్సిపాలిటీ: రూ.21 కోట్లు,ఆత్మకూరు మున్సిపాలిటీ రూ.21 కోట్లు నందికొట్కూర్ మున్సిపాలిటీ: రూ.21 కోట్లు బేతంచెర్ల నగర పంచాయతీ: రూ.17 కోట్లు,రూ.550 కోట్లతో నంద్యాల పట్టణ సమగ్ర అభివృద్ధి నావీ కింద కేటాయించిన రూ.63 కోట్లతో పాటు AMRUT 1.0,AMRUT 2.0, 15వ ఆర్థిక సంఘం నిధులు, మైనారిటీ సంక్షేమ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, BPS/LRS తదితర నిధులను అనుసంధానం చేస్తూ నంద్యాల పట్టణంలో సుమారు రూ.550 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ కు జిల్లా కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

**మంచినీటి సరఫరా:**

నంద్యాల పట్టణంలోని ప్రతి ఇంటికీ నిరంతర, స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనున్నారని అన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పటిష్టం చేయడంతో పాటు అదనపు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు ఉంటుందన్నారు.





**రహదారులు, కాలువల అభివృద్ధి:**

పట్టణంలోని అవసరమైన ప్రాంతాల్లో నాణ్యమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, AMRUT పథకం కింద నూతన సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేసి మురుగునీటిని శుద్ధి చేయడంతో పాటు, శుద్ధి చేసిన నీటిని అవసరమైన విధంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల అభివృద్ధి, పట్టణ సుందరీకరణ పనులు చేపడుతామన్నారు. నంద్యాల పట్టణాన్ని స్వచ్ఛ నంద్యాల ఆరోగ్యకర నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు.100 శాతం ఇంటింటి చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలని, చెత్తను రోడ్లపై, డ్రైనేజీ కాలువల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించాలని అన్నారు. ఇంటింటి నుంచి సేకరించే చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేసి వర్మీ కంపోస్ట్, సేంద్రీయ ఎరువులను తయారు చేసి కిచెన్ గార్డెన్లు, టెర్రస్ గార్డెన్లతో పాటు రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.అభివృద్ధి పనులన్నింటినీ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు సమన్వయంతోపర్యవేక్షించాలని ఆదేశించారు. పనులను పురోగతిన ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ,ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఏ.పి ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

వార్త సాక్ష్యం సెప్టెంబర్ 22- వెలుగోడు:



మండల కేంద్రమైన వెలుగోడులో అఖిల భారత రైతు కూలీ సంఘం పిలుపుమేరకు వెలుగోడు మండల తహసిల్దార్ కార్యాలయం దగ్గర మంగళవారం ధర్నా నిర్వహించారు.డిప్యూటీ తాహసిల్దార్ సుప్రియ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. ఈ ధర్నాను ఉద్దేశించి అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ రాష్ట్రములో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు కురవాల్సిన సమయంలో వర్షాలు లేకపోవడం అధిక ఉష్ణోగ్రతలు భూగర్భ జలాలు అడుగంటడం చెరువులు, కాలువలు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవటం వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటుంది. ఇప్పటికే రాష్ట్రంలోని అత్యధిక ప్రాంతాల్లో ఖరీఫ్ సాగు దెబ్బతింది. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. పశువులకు మేత ప్రజలకు తాగునీరు కూడా సమస్యగా మారింది.ఎల్ ని నో ప్రభావంతో సెప్టెంబర్ లో కూడా రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో సాధారణ కంటే తక్కువగా వర్షపాతము నమోదు అయింది. ఈ స్థితిలో వర్షాభావం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని , గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు పశువులకు మేత అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కావున తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేస్తూ కేంద్ర బృందాలను రాష్ట్రంలో అన్ని జిల్లాలు పరిశీలించే విధంగా చర్యలు తీసుకొని కేంద్ర నిధులు రాబట్టి తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజుకు 700 రూపాయలు చెల్లించాలని, ప్రైవేట్,ప్రభుత్వ బ్యాంకుల రుణాలు రద్దు చేయాలని ఉపాధి కూలీల కుటుంబాల కు తక్షణ సాయం కింద పదివేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆనందరావు, అధ్యక్షులు విజయ్ ,మా భాష ,చిన్న రాముడు ,శివమ్మ, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు

- పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి
- సమస్యల పరిష్కారంపై ప్రతి 15 రోజులకు సమీక్ష నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల, సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం






ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసుల్లో విచారణను వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను సున్నితంగా పరిగణించి, ప్రతి ఫిర్యాదు పై తక్షణమే స్పందించి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసులు, వాటి విచారణ పురోగతి, బాధితులకు అందుతున్న న్యాయపరమైన, ప్రభుత్వపరమైన సహాయం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. కమిటీ సభ్యులు క్షేత్ర స్థాయిలో ప్రస్తావించిన సమస్యలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గుర్తించిన సమస్యలపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించి, తీసుకున్న చర్యలు మరియు పురోగతిని పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**సఫాయి కర్మచారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి**

సఫాయి కర్మచారుల సమస్యలపై చర్చిస్తూ, వారికి PF, ESI తదితర సామాజిక భద్రతా ప్రయోజనాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ESI, PF వంటి సౌకర్యాలను అర్హులైన కార్మికుల ందరూ సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సానిటేషన్ వర్కర్లకు నిబంధనల ప్రకారం పని దినాలు, సెలవులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతున్న అంశంపై స్పందిస్తూ, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**తాగునీటి సౌకర్యాల కల్పనకు చర్యలు**

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో RO వాటర్ ప్లాంట్ల ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నంద్యాల పట్టణ పరిధిలో RO ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాల గుర్తింపులో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చిన్న విస్తీర్ణంలో ఉన్న స్థలాలను కూడా పరిశీలించి, సాధ్యమైన చోట్ల తాగునీటి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ**

జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ బాధితుల సమస్యలను సున్నితంగా పరిగణించి, వారికి అవసరమైన న్యాయపరమైన, ప్రభుత్వపరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన విచారణ పూర్తి చేసి పరిష్కరించేలా సంబంధిత ాణూాలను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివారెడ్డి, ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు, నరేంద్రనాథ్ రెడ్డి, డివియంసీ కమిటీ సభ్యులు నాగరాజు, కాశన్న, రవికాంత్ బాబు, రమేష్ నాయక్, నాగ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బండి ఆత్మకూరు మండలంలో కాగ్ బృందం అంగన్వాడి కేంద్రాల పై ఆకస్మిక తనిఖీలు





బండి ఆత్మకూరు సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం

బండి ఆత్మకూరు మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాలలో అంగన్వాడి కార్యకర్తలు పిల్లలకు అందించే పౌష్టిక ఆహారాలపై ఫ్లన్ పనితీరులో భాగంగా మండలంలోని ఎంపిక చేసిన ఆరు పాఠశాలలు, వాటికి అనుసంధానమైన అంగన్‌వాడీ కేంద్రాలను కాగ్ బృందం సోమ, మంగళవారాల్లో తనిఖీ చేసింది. సీనియర్ ఏఓ విజయ్ ఆధ్వర్యంలో లింగాపురం, నారాయణాపురం, ఈర్నపాడు, బి.కోడూరు, సింగవరం తదితర పాఠశాలలను బృందం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే ఆయా పాఠశాలలకు అనుసంధానమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న సేవలు, రికార్డులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఎఫ్ఎల్ ఎన్ పనితీరును మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలు, సలహాలను సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమం లో కాగ్ బృందం ప్రదీప్, రావత్ లు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

వార్త సాక్ష్యం సెప్టెంబర్ 22, వెలుగోడు :



వెలుగోడు పట్టణంలోని ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో వెలుగోడు మండలం వైఎస్ఆర్ సీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిల్పా మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటము చేయాలని నాయకులకు , కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ నాయకులకు,కమిటీ సభ్యులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి , అంబాల ప్రభాకర రెడ్డి , ఎంపిపి లాలం రమేష్ మండల వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లో తట్టు ప్రాంతాలు జలమయం.



వార్త సాక్ష్యం సెప్టెంబర్ 22 :వెలుగోడు

వెలుగోడు పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హైస్కూలు ఎదురుగా చిన్నపాటి వర్షానికి మడుగుల తయారవుతుంది. బుడ్డా వెంగళ రెడ్డి చెంచుకాలనీ కొట్టాలోకి నీరు చేరడం వలన వారి రాకపోకల ఇబ్బంది ఏర్పడింది. దానిని గమనించిన చెంచు కాలనీకి టీడీపీ నాయకులు రామదాసు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కార్యదర్శి ఎంపిడిఓ మురారి లు చెంచు కాలనీ సందర్శించి జేసీపీ ద్వారా కాలువ తీసి నిల్వ ఉన్న నీటిని కాలువ ద్వారా బయటకు పంపించారు.

# విద్యార్థినులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు.



వార్త సాక్ష్యం సెప్టెంబర్ 22- వెలుగోడు :

జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం నందు మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు డాక్టర్ షేక్షావలి విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 273 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 27 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. కంటి అద్దాలు అవసరమైన విద్యార్థినులకు ఉచిత అద్దాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్షావలి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలను ఎక్కువసేపు ఉపయోగించకుండా ఉండాలని సూచించారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఆకు కూరలు, క్యారెట్, గుడ్లు, పండ్లు వంటి పోషకాహారం తీసుకోవాలని, చదివేటప్పుడు తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలని, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఇ ఓ శ్రీనివాసులు,ఏఎన్ ఎం వరలక్ష్మి దేవి,సిహెచ్ఓ జితేంద్ర, ఆశ వర్కర్లు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో టీచర్ల పై వైసీపీ మూకల దాడి సిగ్గుచేటు..

- గౌరవించాల్సిన టీచర్ల పై భూతులా..!
- ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా

ఆత్మకూరు సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ నగరంలో ఈనెల 21వ తేదీ టీచర్ల పై వైస్సార్సీపీ దాడి చేసిన నేపథ్యంలో మంగళవారం టీచర్ల కు సంఘీ భావంగా ప్రెస్ నోట్ విడుదల చేయడం జరిగిందని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ షేక్ పసిఫిల్ మున్నా అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మార్గదర్శకులుగా గురుదేవోభవ అని నిత్యం గౌరవించాల్సిన ఉపాధ్యాయులపై వైసీపీ గూండాలు భూతు లు మాట్లాడుతూ భౌతిక దాడులకు తెగబడటం అత్యంత హేయమైన చర్య అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నిబంధనల ప్రకారం, స్వచ్ఛం గా ఉద్యోగాలు సాధించుకుని బాధ్యతగా విధి నిర్వహణలో ఉన్నావారిపై ఇలాంటి దాడులేంటని ప్రశ్నించారు. డిఎస్సి నియామకాలు పై చర్చకు రమ్మని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నిసార్లు బహిరంగంగా పిలిచారని, స్పోర్ట్ కోటా విషయమై చర్చించడానికి రవినాయుడు గారు సిద్ధమని అన్నారని, అయినా చర్చకు రావడానికి మొహం చెల్లక ఇలా గూండాగిరీ చేస్తూ గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారా అని నిలదీశారు. డీఎస్సిలో నిజంగా అక్రమాలు జరిగాయనుకుంటే వైసీపీ కోర్టుకు వెళ్లి ఎందుకు నిరూపించడం లేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ కొండంత అండగా నిలుస్తుందని సంఘీభావం తెలియజేశారు. వెంటనే దాడికి పాల్పడిన వైసీపీ గూండాలను అరెస్టు చేసి, ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని, పోలీసులను కోరారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 23 సెప్టెంబర్ 2026

## కర్నూలు వినాయక లడ్డు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సొంతం

- 4 లక్షలకు ఆరవ సారి వేలంలో దక్కించుకున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



కర్నూలు సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం

మంగళవారం కర్నూలు నగరంలోని ప్రసిద్ధి గాంచిన రాంబోట్ల దేవాలయం వారి వినాయకుని లడ్డూ ప్రసాదాన్ని వరుసగా 6 ఆరవ సారి కూడా అక్షరాల నాలుగు లక్షల (4,00,000) రూపాయలకు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు,లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి సొంతం చేసుకున్నారు.

## బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం

శ్రీశైలం దేవస్థానం సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం



శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణం కోసం దేవస్థానం సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళ వారం మరియు అమావాస్య రోజుల లో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలు వీరభద్రస్వామి వారు శివ భక్త గణాల కు అధిపతి. అదేవిధంగా శ్రీశైల క్షేత్ర పాలకుడుగా క్షేత్రానికి ఆరు బయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్న వదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం,బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగి పోతాయి.అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి.ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకు మోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

## అన్న ప్రసాద వితరణ పథకానికి దాతల విరాళం



శ్రీశైల దేవస్థానం సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణలో భాగంగా శ్రీమతి యన్.శ్రీలక్ష్మి, హైదరాబాదు వారు అన్నప్రసాదవితరణ పథకానికి రూ.1,00,000/-లు విరాళాన్ని విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు సహాయ కార్యనిర్వహణాధికారి యం.ఫణిధర ప్రసాదుకు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు అందజేయబడ్డాయి.

## కర్నూలు గణేష్ నిమజ్జనం వేడుకల్లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మినరల్ వాటర్ పంపిణీ

కర్నూలు ప్రతినిధి,సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం






గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులు,ప్రజలకు సేవలందించేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూలు జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.రెడ్ క్రాస్ చైర్మన్ డా.కె.జి.గోవింద రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా బ్రాంచ్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గణేష్ నిమజ్జనాని కి తరలివెళ్తున్న భక్తులకు ఉచితంగా మినరల్ వాటర్ అందించారు.నిమజ్జన కార్యక్రమా నికి హాజరయ్యే ప్రజలకు దాహార్తి తీర్చడంతో పాటు సేవా కార్యక్రమం ద్వారా రెడ్ క్రాస్ మానవతా సేవా స్ఫూర్తిని చాటింది.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ కె.అరుణ మాట్లాడుతూ మానవత్వమే ప్రధాన ధ్యేయంగా, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూలు జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.రక్తదానం,తలసేమియా బాధిత చిన్నారులకు రక్త సరఫరా,ప్రథమ చికిత్స,విపత్తుల సమయంలో సహాయక చర్యలు,వికలాంగులకు సహాయ పరికరాల పంపిణీ తదితర కార్యక్రమాలను రెడ్ క్రాస్ నిర్వహిస్తోంది అని అన్నారు.అనంతరం మాజీ చైర్మన్ జి.శ్రీనివాసులు, ట్రెజరర్ ఇల్లూరు నరసింహ,మాజీ ట్రెజరర్ జె.రఘునాథరెడ్డి,ఎంసీ మెంబర్ వి.భీమ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవలో భాగంగా పండుగలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు ప్రకాష్ మరియు సిబ్బంది పాల్గొని భక్తులకు మినరల్ వాటర్ పంపిణీ చేశారు.

## హామీలు గాలిలోనే.. వీఆర్ఏల కడుపుమంట...!

- వేతనాల కోసం వీఆర్ఏల బతుకులు రోడ్లపాలు
- వీఆర్ఏలు అంటే అంత చులకన ప్రభుత్వానికి ఎందుకు?

బండి ఆత్మకూరు సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం..




రెండేళ్లు గడిచినా సమస్యలు పరిష్కారం కాలేదంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట 7వ రోజు కొనసాగుతున్న వీఆర్ఏల సమ్మె.హామీలు ఇచ్చారు అధికారంలోకి వచ్చారు. రెండేళ్లు గడిచాయి.. కానీ వీఆర్ఏల సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే! తమను పట్టించుకునే నాథుడే లేడంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు నిరవధిక సమ్మె నిర్వహిస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. వేతన పెంపు లేదు.. పదోన్నతులు లేవు.. సమస్యలకు శాశ్వత పరిష్కారం లేదు.. మరి తమ బతుకులు ఎలా సాగించాలంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. వీఆర్ఏల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు .పెద్దన్న, నంద్యాల జిల్లా అధ్యక్షుడు, నారాయణ, బండి ఆత్మకూరు మండల అధ్యక్షుడు శేషు, మాట్లాడుతూ.. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందని అన్నారు. తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం, కూడా భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పని మాత్రం పెరుగుతోంది.. జీతం మాత్రం పెరగడం లేదని మండిపడ్డారు. “హామీలతో మా కడుపులు నిండవు.. మా కుటుంబాలు బతకాలంటే న్యాయమైన వేతనం, పదోన్నతులు కావాలి” అంటూ వీఆర్ఏలు ప్రభుత్వాన్ని నిలదీశారు. తమ ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వీఆర్ఏ జేఏసీ నాయకులు హెచ్చరించారు.

## ఆత్మకూరులో వైఎస్ఆర్ సీపీ శంఖారావం

- భారీ జనసందోహం మధ్య ఘనంగా విస్తృత స్థాయి సమావేశం
- అధిక సంఖ్యలో తరలివచ్చిన వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు.. కిక్కిరిసిన ఎల్.వి. ఫంక్షన్ హాల్

ఆత్మకూరు సెప్టెంబరు 22 వార్త సాక్ష్యం







పట్టణంలోని ఎల్.వి. ఫంక్షన్ హాల్లో శ్రీశైలం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. శ్రీశైలం నియోజక వర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరు పట్టణం, మండలం నుంచి వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో ఫంక్షన్ హాల్ కిక్కిరిసిపోయింది. పార్టీ శ్రేణుల భారీ హాజరుతో సమావేశ ప్రాంగణం సందడిగా మారింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం, కార్యకర్తలను పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయడం వంటి అంశాలపై శిల్పా చక్రపాణి రెడ్డి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై శిల్పా చక్రపాణి రెడ్డి గారు ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ నాయకులు, కమిటీ సభ్యులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులను మరింత సమన్వయం చేసుకుంటూ ప్రజలతో మమేకమై పార్టీని బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత అవకాశం కల్పిస్తామని శిల్పా చక్రపాణి రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థుల ఒత్తిళ్లకు, బెదిరింపులకు లేదా అక్రమ కేసులకు కార్యకర్తలు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.అధికారులెవరైనా చట్టప రమైన పరిధిని దాటి అన్యాయంగా వ్యవహరిస్తే, చట్టబద్ధమైన మార్గాల్లో న్యాయపోరాటం చేస్తామని శిల్పా చక్రపాణి రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశం లో శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కుందూరు శివారెడ్డి,పట్టణ అధ్యక్షుడు, ఎన్ఎస్, సయ్యద్ మీర్, మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి, శ్రీశైలం నియోజక వర్గం బీసీ సెల్ నాయకులు, వరకవి నాగరాజు, బాపనంతాపురం వైఎస్ఆర్సిపి నాయకులు రాజేష్, రాష్ట్ర మైనార్టీ సెల్ సీనియర్ నాయకులు మోమిన్ మునీర్ భాష, వైసీపీ మైనార్టీ సీనియర్ నాయకులు మోమిన్ అహ్మద్ హుస్సేన్, మోమిన్ ముస్తఫా, మైనార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు అంజాద్ అలీ, మాజీ గ్రామ సర్పంచులు కృష్ణాపురం లక్ష్మిరెడ్డి, ముష్టపల్లె రవి నాయక్, మాజీ వార్డు కౌన్సిలర్లు కలుముల్లా, పాణ్యం పార్వతి, మహిళా నాయకురాలు దరగమ్మ, షఫీ ఉన్ రవణమ్మ తో పాటు వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీశైల దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం దేవస్థానం సెప్టెంబర్ 22 వార్తా సాక్ష్యం




శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్య కళారాధన కార్యక్రమంలో ) శ్రీమతి అనీలా మరియు వారి బృందం, గుంటూరు వారిచే భజన కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ భజన కార్యక్రమం ఏర్పాటు చేయ బడింది. ఈ కార్యక్రమములో గణపతి ప్రార్థన, శ్రీశైల శివమయం, శంభో మహేశ, శివ శివ అనరాదా, చాలదా ఈ జన్మ చాలదా, హే విశ్వలింగ వాయులింగా, పరమశివ పరమ శివ మొదలైన పలు భక్తిగీతాలను, అష్టకాలను హృషికేశవరెడ్డి, నరసింహారెడ్డి, శివశంకరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, పుల్లారెడ్డి, ఈశ్వరమ్మ, శివారెడ్డి తదితరులు ఆలాపించనున్నారు. ఈ కార్యక్రమానికి తబలా సహకారాన్ని ప్రసాదు, హార్మోని సహకారాన్ని అమ్మణ్ణి, చంద్రమౌళీశ్వరరెడ్డి అందించనున్నారు. కాగా శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ ధర్మపథం కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# కాకినాడలో జరిగిన జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం








**- నంద్యాల పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేషన్ సభ్యురాలు, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ మైలేరి సురేఖ**
**- సమావేశానికి హాజరైన జనసేన అధినాయకుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**
**- రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో జనసేన సత్త చూపాలి**

నంద్యాల సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో మున్సిపల్, నగర పంచాయతీలు, కార్పొరేషన్లలో, జనసేన పార్టీ నుంచి చైర్మన్ గా నిలబడే అభ్యర్థులతోపాటు గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో జన సైనికులు పార్టీ సిద్ధాంతాల అనుగుణంగా పోటీకి సిద్ధంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉప పవన్ కళ్యాణ్ తెలియజేశారు మంగళవారం కాకినాడ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశానికి నంద్యాల పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేషన్ సభ్యురాలు, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ మైలేరి సురేఖ హాజరయ్యారు నంద్యాల జిల్లాలో జనసేన పార్టీ బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేసేందుకు ఆమె స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు విశ్వనియవర్గాల సమాచారం.

# గోరుకల్లు పరిస్థితి పై జిల్లా యంత్రాంగం అప్రమత్తం

**- ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత.. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ**
**- వెంట్‌గేట్ ఘటనపై సమగ్ర విచారణ.. బాధ్యులపై కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల, సెప్టెంబర్ 22: వార్త సాక్ష్యం





పాణ్యం మండలం గోరుకల్లు గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం ఆమె గోరుకల్లు గ్రామాన్ని స్వయంగా సందర్శించి,అక్కడి పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు సంబంధించిన వెంట్‌గేట్‌ను ఎవరు ఎత్తారు, ఎవరి ద్వారా గేట్ తెరవబడింది అనే అంశంపై సమగ్ర విచారణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చిన అనంతరం బాధ్యులుగా తేలిన వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వరదలు, నీటి ప్రవాహం తదితర కారణాలతో ఎక్కడెక్కడ నష్టం వాటిల్లిందో ఆయా ప్రాంతాలను గుర్తించి, పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతూ, అవసరమైన మేరకు బ్లీచింగ్ పౌడర్‌ను సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ను ఆదేశించినట్లు పేర్కొన్నారు. పంటలు నష్టపోయిన గ్రామాల్లో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి, నష్టం మరియు ప్రజల సమస్యల పై సమగ్ర నివేదికను సమర్పించేలా అధికారులకు ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. గోరుకల్లు, పరిసర ప్రాంతాల్లో నీటి మట్టం సుమారు మూడు అడుగుల మేర ఉన్న నేపథ్యంలో పరిస్థితిని క్షేత్రస్థాయిలో నిరంతరం పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితులు ఏర్పడిన వెంటనే ప్రజలకు తక్షణ సహాయం అందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భద్రతకు ఎటువంటి ముప్పు కలగకుండా జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు.

# విద్యుత్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం- నీళ్లు లేక గ్రామ ప్రజల అవస్థలు

**- జూటూరు గ్రామ రజక కాలనీ వాసులు, ప్రజలు ఇబ్బందులు**

పాములపాడు సెప్టెంబర్ 22 వార్త సాక్ష్యం





పాములపాడు మండలంలోని, జూటూరు గ్రామంలో విద్యుత్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల గత 20 రోజులుగా నీళ్లు లేక అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివారులో ఉన్న చాకలి వీధి ప్రాంతంలో విద్యుత్ కాంట్రాక్టర్ త్రీఫేస్ లైన్ కోసం విద్యుత్ స్తంభాన్ని వేసారు, అయితే ఆ విద్యుత్ స్తంభం వేసే సమయంలో పైప్ లైన్ పగలగొట్టడంతో పైప్లైన్ ద్వారా వచ్చే నీళ్లన్నీ వృధాగా పోతున్నాయనీ అన్నారు. తమ కుళాయిలకు గత 20 రోజులుగా నీళ్లు రావడంలేదని ఎన్నిసార్లు విద్యుత్ కాంట్రాక్టర్ కు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇప్పటికైనా అధికారులు కానీ, కాంట్రాక్టర్ గాని తమ పైప్ లైన్ సరిచేసి నీళ్ళు ఇవ్వవలసిందిగా కోరుచున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న సమస్య సీసీ రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటికి పైపు లైన్ లు వేసి మా రజక కాలనీ వాసులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని జూటూరు గ్రామస్తులు మౌళాలి, చిన్నన్న, సుంకన్న,శేఖర్, రాములు, సామక్క , మాధవి, సావిత్రి, మధులత, భువనేశ్వరి, లక్ష్మీదేవి కోరారు. రజక కాలనీ వాసుల తాగునీటి గురించి జూటూరు గ్రామపంచాయతీ కార్యదర్శి నీ వివరణ అడుగగా ఇప్పుడు ఉన్న పరిస్థితులో మేము ఏమి చేయలేము, గ్రామ పంచాయతీ నిధులు లేవు, విద్యుత్ కాంట్రాక్టు వాళ్ళు ఈ సమస్యపై స్పందించి వారు పైపులైన్ వేయిస్తే సరిపోతుందనీ సమాధానమిచ్చారు. ఈ విషయము పై సంబంధించిన గ్రామ పంచాయతీ అధికారులు, కానీ, విద్యుత్ కాంట్రాక్టు కానీ, స్పందించి దెబ్బతిన్న పైపు లైన్ ను వెంటనే మరమ్మతులు చేసి, నీటి సరఫరా పునరుద్ధరించాలని జూటూరు గ్రామ ప్రజలు పత్రిక ముఖంగా తెలియజేశారు.

# శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి విశేష అభిషేకం

శ్రీశైలం దేవస్థానం సెప్టెంబర్ 22 వార్తా సాక్ష్యం



శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణం కోసం దేవస్థానం ఉదయం ఆలయ ప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్య స్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారి సేవ గా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామి వారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి.అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసు బ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామి వారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# నందీశ్వరస్వామికి విశేషపూజ



శ్రీశైలం దేవస్థానం సెప్టెంబర్ 22 వార్తా సాక్ష్యం

శ్రీశైల దేవస్థానంలో లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు ఆలయ ప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది.ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ ను జరిపించబడుతుంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వర స్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

# పట్టణాల్లో అభివృద్ధి పండగ




సెప్టెంబర్ 22 వార్తా సాక్ష్యం

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) నిధులతో బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, ఐఏఎస్ తెలిపారు. చీరాల మున్సిపాలిటీలో రూ.30 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే ముద్దులూరి మాల కొండయ్యతో కలిసి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ మూడు మున్సిపాలిటీలకు తలా రూ.30 కోట్ల చొప్పున మొత్తం రూ.90 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని, నిధుల కేటాయింపు, పనుల పురోగతిని ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సూచనలు, ఫిర్యాదుల ఆధారంగా పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన అభివృద్ధి నిధులతో అన్ని నియోజకవర్గాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. నిధుల రాకతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, రాబోయే రోజుల్లో నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయనిపేర్కొన్నారు.వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, మార్గదర్శకాలు అందించాలని ఆదేశించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోసెఫ్, ఆర్డీఓ నరసింహారావు, మున్సిపల్ అధికారులు, తహశీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

వార్త
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 23 సెప్టెంబర్ 2026

# బిజినెస్

## నాలుగు రోజుల లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిఫ్టీ లాభాల జోరుకు బ్రేక్ పడింది. ప్రధానంగా ఐటీ, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు నష్టాల్లోకి జారాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 329.91 పాయింట్లు (0.44 శాతం) నష్టపోయి 74,529.08 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 85.30 పాయింట్లు (0.36 శాతం) క్షీణించి 23,329.00 వద్ద ముగిసింది. నాలుగు రోజుల వరుస లాభాల తర్వాత ఇన్వెస్టర్లు హెవీవెయిట్ షేర్లలో లాభాలను స్వీకరించడం మార్కెట్లపై ప్రభావం చూపింది. రంగాలవారీగా చూస్తే.. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయింది. దీనితో పాటు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఫార్మా సూచీలు కూడా నష్టాల్లో ముగిశాయి. మరోవైపు, మీడియా, రియల్ ఎస్టేట్, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఈ రంగాల సూచీలు లాభాల్లో ముగియడంతో మార్కెట్ నష్టాలు కొంతమేర పరిమితమయ్యాయి. నిఫ్టీలో ట్రెంట్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్రాడర్ మార్కెట్‌లో కూడా బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.08 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం స్వల్పంగా నష్టపోయాయి. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు కొన్ని రంగాల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుని, ఇతర రంగాల్లోకి మళ్లిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్

అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. భారత్‌లో తన నాలుగో క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో సోమవారం అధికారికంగా ప్రారంభించింది. భారత్‌లో డిజిటల్, కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక వసతుల అభివృద్ధి కోసం కంపెనీ గతంలో ప్రకటించిన 2,050 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.95 లక్షల కోట్లు) పెట్టుబడుల ప్రణాళికలో భాగంగా మైక్రోసాఫ్ట్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కంపెనీకి భారత దక్షిణ మధ్య క్లౌడ్ రీజియన్ అయిన ఈ కేంద్రం.. గత నెల 6వ తేదీనే అందుబాటులోకి వచ్చింది. మైక్రోసాఫ్ట్ ఇప్పటికే పుణె, చెన్నై, ముంబైలో క్లౌడ్ రీజియన్‌లను ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన హైదరాబాద్ క్లౌడ్ రీజియన్‌లో కూలింగ్ కోసం నీటికి బదులు ఎయిర్ కూల్డ్ చిల్లర్స్‌పై ఆధారపడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ తెలిపారు. దేశంలో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ సేవల కేంద్రం ఇదేనని ఆయన అన్నారు.




### మూడు జోన్లుగా నిర్మాణం

హైదరాబాద్ క్లౌడ్ రీజియన్‌ను మైక్రోసాఫ్ట్ మూడు జోన్ల ఆర్కిటెక్చర్‌తో అభివృద్ధి చేసింది. మిషన్ క్రిటికల్, ఏఐ వర్క్‌లోడ్స్‌కు మద్దతిచ్చేలా డిజైన్ చేసింది. భారత్‌లోని తమ అన్ని డేటా సెంటర్లు ఏఐ ఎనేబుల్డ్, ఏఐ క్యాపబుల్ హార్డ్‌వేర్, అధిక సామర్థ్యంతో కూడిన కూలింగ్ వ్యవస్థలను కలిగి ఉండటంతో పాటు ఆధునిక ఏఐ వర్క్‌లోడ్స్ నిర్వహణకు అనుకూలంగా ఉన్నాయని మైక్రోసాఫ్ట్ తెలిపింది. హైదరాబాద్ కేంద్రంలో అదనంగా అజుర్, ఏఐ సేవలందించే ఆలోచన ఉందని సంస్థ వెల్లడించింది.

### విద్యుత్ కేంద్రాలకు దగ్గర్లో డేటా సెంటర్లు

భారత్‌లో భవిష్యత్ డేటా సెంటర్లను విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు సమీపంలో ఏర్పాటు చేయాలని మైక్రోసాఫ్ట్ ను కేంద్ర ప్రభుత్వం కోరింది. తద్వారా కంపెనీతో పాటు ప్రభుత్వానికి ఖర్చులు తగ్గుతాయని హైదరాబాద్ క్లౌడ్ రీజియన్‌ను ప్రారంభించిన సందర్భంగా కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ కార్యదర్శి ఎస్ కృష్ణన్ అన్నారు.

### మానవ సేవ కోసమే ఏఐ అభివృద్ధి..

కృత్రిమ మేధ సాంకేతికత భద్రతపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్ చందోక్ కీలక వ్యాఖ్యలు చేశారు. మానవ సేవ కోసం మాత్రమే ఏఐని అభివృద్ధి చేయాలని, ఈ సాంకేతికతపై నియంత్రణ ఎల్లప్పుడూ మన చేతుల్లోనే ఉండాలని మైక్రోసాఫ్ట్ గట్టిగా నమ్ముతుందన్నారు.

### 2035 నాటికి 12-14 గిగావాట్లకు డేటా సెంటర్ల సామర్థ్యం

ప్రస్తుతం భారత్ 2 గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లను కలిగి ఉందని.. 2035 నాటికిది 12-14 గిగావాట్లకు చేరుకోవచ్చని పునీత్ చందోక్ అన్నారు. ఆసియాతో పాటు దక్షిణార్ధ గోళానికి భారత్ ఏఐ మౌలిక వసతు ల హబ్‌గా అవతరించనుందని పేర్కొన్నారు. ప్రపంచ డేటాలో 20 శాతం భారత్ నుంచే ఉత్పన్నమవుతుండగా.. ప్రపంచ డేటా సెంట ర్ల సామర్థ్యంలో ఇండియా వాటా కేవలం 3 శాతమేనని చందోక్ వెల్లడించారు. ఈ గణాంకాలను బట్టి చూస్తే, భారత్‌లో డేటా సెంటర్ల సామర్థ్య విస్తరణకు భారీగా అవకాశాలున్నాయన్నారు. కాగా, భారత పబ్లిక్ క్లౌడ్ సేవల వ్యయాలు 2030 నాటికి 4,570 కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని, ఏటేటా 22.2 శాతం వృద్ధి చెందవచ్చని పరిశోధన సంస్థ ఐడీసీ అంచనా వేసింది. ఏఐ వ్యయాలు ఇంతకు రెట్టింపు స్థాయిలో పెరగవచ్చని పేర్కొంది.

# అదరగొట్టిన భారత అమ్మాయిలు..

## ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి గోల్డ్ మెడల్




ఆసియా క్రీడలు 2026లో భారత్ బంగారు బోణీ కొట్టింది. మహిళల క్రికెట్ ఫైనల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు అద్భుత ప్రదర్శనతో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ఏకంగా 147 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో భారత మహిళల జట్టు తమ గోల్డ్ మెడల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుంది. ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. ఈ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల రికార్డు స్కోరు నమోదు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగింది. కేవలం 45 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 79 పరుగులు చేసి భారీ స్కోరుకు బలమైన పునాది వేసింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ ఆఖరి ఓవర్లలో విధ్వంసం సృష్టించింది. కేవలం 22 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో అజేయంగా 49 పరుగులు సాధించి జట్టు స్కోరును 200 పరుగులు దాటించడంలో కీలక పాత్ర పోషించింది. వీరిద్దరి మెరుపులతో లంక బౌలర్లకు చుక్కలు కనిపించాయి. అనంతరం 217 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, భారత బౌలర్ల ధాటికి ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. ఆది నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి కుప్పకూలింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో లంక బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా స్పిన్నర్ దీప్తి శర్మ తన మాయాజాలంతో లంక పతనాన్ని శాసించింది. తన 4 ఓవర్ల కోటాలో కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టింది. మిగతా బౌలర్లు కూడా రాణించడంతో శ్రీలంక జట్టు 69 పరుగులకే ఆలౌట్ అయింది. శ్రేయాంక పాటిల్ చివరి వికెట్ తీయడంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ ఆల్ రౌండ్ ప్రదర్శనతో భారత మహిళల జట్టు ఆసియా క్రీడల్లో తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది.

## సచిన్ మరో రికార్డు బ్రేక్ చేసిన జో రూట్.. 23 వేల పరుగులతో సంచలనం!




ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ మరో అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 23 వేల పరుగుల మైలురాయిని అత్యంత వేగంగా అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. శ్రీలంకతో డర్హామ్‌లో మంగళవారం జరిగిన తొలి వన్డేలో ఈ ఘనత సాధించాడు. 23 వేల పరుగులు పూర్తి చేసేందుకు రూట్‌కు మరో మూడు పరుగులు మాత్రమే అవసరమయ్యాయి. ఈ దశలో అద్భుతమైన ఫ్లిక్ షాట్‌తో బౌండరీ బాది మైలురాయిని అందుకున్నాడు. 521వ అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లో ఈ ఘనత సాధించాడు. దీంతో 522 ఇన్నింగ్స్‌ల్లో 23 వేల పరుగులు పూర్తి చేసిన భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను వెనక్కి నెట్టాడు. 490 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మార్క్‌ను అందుకున్న విరాట్ కోహ్లీ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 23 వేల పరుగులు చేసిన ఎనిమిదో బ్యాటర్‌గా రూట్ నిలిచాడు. ఈ ఘనత సాధించిన తొలి ఇంగ్లండ్ ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. సచిన్, కోహ్లీ, రాహుల్ ద్రవిడ్, కుమార సంగక్కర, మహేల జయవర్ధనే, రికీ పాంటింగ్, జాక్వెస్ కలిస్ ఈ జాబితాలో ఉన్నారు. రూట్ ఇప్పటికే టెస్టు క్రికెట్‌లో సచిన్ పేరుతో ఉన్న పలు రికార్డులను అధిగమించాడు. ఇటీవల టెస్టుల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన బ్యాటర్‌గా సచిన్ రికార్డును కూడా బద్దలు కొట్టాడు.

# స్పోర్ట్స్

## జపాన్‌తో మ్యాచ్ తర్వాత శ్రేయస్ అయ్యర్ షాకింగ్ కామెంట్స్




జపాన్‌తో మ్యాచ్ కోసం తాము సుదీర్ఘ ప్రయాణం చేశామని, చివరకు స్టేడియానికి చేరుకోవడానికి ఏకంగా మూడు గంటలు పట్టిందని భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చెప్పాడు. ఐదు ఓవర్ల మ్యాచ్ అయినా ఆడే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నాడు. భారత్, జపాన్ మధ్య దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ మ్యాచ్ నిర్వహించడం ప్రత్యేకమని పేర్కొన్నాడు. వర్షం కారణంగా మ్యాచ్ ఐదు ఓవర్లకే పరిమితమైనా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారని చెప్పాడు. జపాన్ జట్టు ఆటతీరుపై అయ్యర్ ప్రశంసలు కురిపించాడు. ఆ జట్టు చూపించిన పోరాట పటిమ అద్భుతంగా ఉందని అన్నాడు. “జపాన్ జట్టు చూపించిన వైఖరి అద్భుతం. వాళ్లు సరైన దారిలోనే వెళ్తున్నారు” అని పేర్కొన్నాడు. సానోలోని కఠినమైన పిచ్ పై ఆడటం తమకు కూడా మంచి ప్రాక్టీస్‌గా ఉపయోగపడిందని చెప్పాడు. “బంతి బాగా తిరుగుతోంది. వేగంలోనూ మార్పులు ఉన్నాయి. బ్యాటింగ్ చేయడం చాలా కష్టంగా అనిపించింది. అందుకే సింగిల్స్, డబుల్స్‌పై దృష్టిపెట్టా. ప్రతి బంతిని దాని మెరిట్ ప్రకారం ఆడాలని నిర్ణయించుకున్నా” అని అయ్యర్ వివరించాడు. ఐదు ఓవర్ల మ్యాచ్‌లో ఏ క్షణంలోనైనా పరిస్థితులు మారిపోతాయని అయ్యర్ అన్నాడు. బాధ్యత పెరిగినప్పుడు ఒత్తిడి కూడా ఉంటుందని, అయితే తాను ఒత్తిడిని ఆస్వాదిస్తానని చెప్పాడు. ముందుగా ఒక్కో అడుగు చొప్పున ముందుకెళ్లాలని, ఆసియా క్రీడల వేదికకు వెళ్లిన తర్వాత అక్కడి పరిస్థితులను అంచనా వేసి తమ వ్యూహాలను నిర్ణయించుకుంటామని పేర్కొన్నాడు.

# 'రామ్ అండ్ లీలా' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!

ఈ మధ్య కాలంలో డిఫరెంట్ కంటెంట్ ను టచ్ చేయడానికే మేకర్స్ ఉత్సాహాన్ని చూపుతున్నారు. కాన్సెప్ట్ కొత్తగా అనిపిస్తే చాలు చూడటానికి ఆడియన్స్ ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చిన సినిమానే 'రామ్ అండ్ లీలా'. రియో రాజ్ – వర్తిక జైన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఆగస్టు 21వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఇప్పుడు ఈ సినిమా తమిళంతో పాటు, తెలుగు .. మలయాళ .. కన్నడ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. ఈ నెల 18వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. రఘురామ్ (రియో రాజ్) ఒక మిడిల్ క్లాస్ కుటుంబానికి చెందిన యువకుడు. తండ్రి ఆర్టీసీలో డ్రైవర్ గా పనిచేస్తూ ఉంటాడు. కొన్ని కారణాల వలన, తండ్రికి .. కొడుకుకి మధ్య మాటలు ఉండవు. ఇద్దరి మధ్య తల్లి .. చెల్లి రాయబారం చేస్తుంటారు. వయసు 30 దాటుతున్నా పెళ్లి కాకపోవడంతో రఘురామ్ టెన్షన్ పడుతూ ఉంటాడు. తాను నచ్చలేదని చెబుతున్న అమ్మాయిల సంఖ్య పెరిగిపోతూ ఉండటంతో, ఇక ఎవరినైనా ముగ్గులోకి లాగేసి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. అమ్మాయిలు ఎక్కువమంది తారసపడతారనే ఉద్దేశంతోనే అతను లోకల్ ట్రైన్ లో తిరగడం మొదలుపెడతాడు. మొత్తానికి అతని ప్రయత్నం ఫలించి, 'లీలా'( వర్తిక జైన్) పరిచయమవుతుంది. సాయంత్రం 6 గంటల తరువాత తనని కలిసే ప్రయత్నం చేయవద్దనీ, అలా అయితేనే అతనిని ప్రేమిస్తానంటూ ఆమె షరతు పెడుతుంది. అందుకు రఘురామ్ ఒప్పుకుంటాడు. తన ఫ్యామిలీకి పరిచయం చేస్తాడు. అందమైన అమ్మాయి కోడలిగా రాబోతున్నందుకు ఆమె ఎంతో సంతోష పడుతుంది. ఇక లీలా తన ఇంటికి రావొద్దని చెప్పినా వినిపించుకోకుండా రఘురామ్ వాళ్ల ఇంటికి వెళతాడు. సాయంత్రం 6 గంటల తరువాత ఆమెను ఎందుకు కలవకూడదో చెప్పమని నిలదీస్తాడు. తన పూర్వీకులు ఏలియన్స్ అనీ, సాయంత్రం 6 దాటిన తరువాత తాను అబ్బాయిగా మారిపోతానని చెబుతుంది లీలా. అప్పుడు రఘురామ్ ఏం చేస్తాడు? లీలను పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకుంటాడా ? అనేది మిగతా కథ. వయసు ముదిరిపోతుందని కంగారుపడిపోయిన రఘు రామ్, నానా కష్టాలుపడి ఒక అమ్మాయిని లైన్లో పెడతాడు. ఆ అమ్మాయినే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. తన ప్రేమను పెళ్లి పీటల దిశగా తీసుకుని వెళుతున్న సమయంలో, ఆమె ఏలియన్ ఫ్యామిలీ నుంచి వచ్చిన అమ్మాయని తెలుస్తుంది. అప్పుడు అతను ఎలా రియాక్ట్ అవుతాడనే అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు. హీరో పెళ్లి లేటైపోతోందని టెన్షన్ పడిపోతూ అమ్మాయిల వెంటపడుతూ ఉండటం, అందమైన అమ్మాయి లైన్లో పడగానే మురిసిపోవడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ చాలా సరదాగా .. సందడిగా నడిచిపోతుంది. ఆ అమ్మాయి ఏలియన్ ఫ్యామిలీకి చెందింది అనే విషయం తెలిసిన తరువాత మొదలయ్యే గందరగోళంతో సెకండాఫ్ కి సంబంధించిన సన్నివేశాలు పరుగులు పెడుతూ ఉంటాయి. హీరో అందమైన అమ్మాయి వెంటపడుతూ ఉండటం, సాయంత్రం 6 గంటల తరువాత తనని కలిసే ప్రయత్నం చేయవద్దని ఆమె తప్పించుకుంటూ తిరుగుతూ ఉండటం వంటి సన్నివేశాలు సరదాగా అనిపించడమే కాకుండా, అందుకుగల కారణం ఏమిటనేది తెలుసుకోవాలనే కుతూహలం పెరుగుతూ పోతుంటుంది. అయితే ఆ కారణం ఏమిటనేది తెలిసిన తరువాత, కంటెంట్ పై ఆడియన్స్ కి ఇంట్రెస్ట్ పోతుంది. అక్కడి నుంచి గ్రాఫ్ పడిపోవడం మొదలవుతుంది. లీలా తాను ఏలియన్ ఫ్యామిలీకి చెందినదానిగా చెప్పుకోవడం వలన కొంత ఆసక్తి తగ్గితే, సాయంత్రం 6 గంటల తరువాత తాను అబ్బాయిగా మారిపోతానని చెప్పడం .. కంటెంట్ ను మరింత నీరు గారుస్తుంది. దర్శకుడు ఇక్కడి నుంచి ఒక గందరగోళాన్ని క్రియేట్ చేసి అందులో నుంచి కామెడీని రాబట్టాలని చూశాడు. కానీ ఆశించిన స్థాయిలో అది వర్కౌట్ కాలేదు. ఎప్పుడైతే తాను ఏలియన్ ఫ్యామిలీ నుంచి వచ్చానని




హీరోయిన్ చెప్పిందో అక్కడి నుంచే ఈ కథ ఆడియన్స్ కి దూరంగా వెళుతుంది. ఇక సాయంత్రం 6 గంటలు దాటగానే అబ్బాయిగా మారిపోతాననే విషయం కనెక్ట్ కాలేకపోయింది. ఈ కథలో కొత్త పాయింట్ అని దర్శకుడు దేనినైతే అనుకున్నాడో, ఆ పాయింట్ వాస్తవానికి దూరంగా వెళ్లిపోయింది. కామెడీని వర్కౌట్ చేయలేక కుంటుపడింది. రియోరాజ్ – వర్తికతో పాటు మిగతా ఆర్టిస్టులంతా బాగానే చేశారు. మల్లికార్జున్ ఫొటోగ్రఫీ .. అంకిత్ మీనన్ సంగీతం .. శివ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. ఫస్టాఫ్ సరదాగా అనిపించిన ఈ సినిమా, సెకండాఫ్ లో గందరగోళంలో పడేస్తుంది. నమ్మలేని విషయాలను జీర్ణించుకోలేకపోయిన ఆడియన్స్, గండం గడిచిందిరా బాబూ అనుకునేలా చేస్తుంది.

# సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి..

## 'శివశంకర వర ప్రసాద్' నుంచి 'చిరంజీవి' వరకు అపూర్వ ప్రయాణం పై మెగాస్టార్ భావోద్వేగం

తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి ఒక సామాన్యుడిగా అడుగుపెట్టి, ఎన్నో విజయాలను సొంతం చేసుకుని మెగాస్టార్ గా అవతరించిన చిరంజీవి... తన సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా అత్యంత భావోద్వేగపూరిత పోస్ట్‌ను పంచుకున్నారు. 1978 సెప్టెంబర్ 22న తాను నటించిన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు' వెండితెరపై విడుదలైన రోజే తన జీవితంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ రోజున కొణిదెల శివశంకర వరప్రసాద్ అనే తన అసలు పేరును 'చిరంజీవి'గా మార్చుకున్నానని, నేడు అదే పేరు తనకు కోట్లాది మంది అభిమానుల గుండెల్లో శాశ్వత గుర్తింపుగా మిగిలిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు. సుదీర్ఘమైన ఈ 48 ఏళ్ల పయనంలో ఎన్నో రకాల పాత్రలను పోషించానని, లెక్కలేనన్ని అపూర్వ విజయాలు, గౌరవాలు, జాతీయ అంతర్జాతీయ అవార్డులను అందుకున్నానని చిరంజీవి పేర్కొన్నారు. తనకు నటుడిగా అవకాశాలు ఇచ్చిన నిర్మాతలు, తనలోని సరికొత్త నటనను ఆవిష్కరించిన దర్శకులు, అహర్నిశలు శ్రమించిన సాంకేతిక నిపుణులు, తోటి నటీనటులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇవన్నీ ఒకెత్తయితే తనపై కోట్లాది మంది అభిమానులు చూపిస్తున్న నిరంతర ప్రేమాభిమానాలే తన జీవితంలో అతిపెద్ద విజయమని, అభిమానులను తన సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తూ శిరస్సు వంచి ధన్యవాదాలు అర్పిస్తున్నానని వెల్లడించారు. కాగా,




చిరు నటించిన మొదటి సినిమా 'పునాది రాళ్లు' అయినప్పటికీ, 'ప్రాణం ఖరీదు' ముందుగా విడుదలైంది. ప్రస్తుతం ఆయన 'కాకా', 'విశ్వంభర' వంటి భారీ ప్రాజెక్టులతో వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతున్నారు.

# రాష్ట్రపతి చేతుల మీదుగా 'కమిటీ కుర్రోళ్లు' టీమ్‌కు జాతీయ అవార్డు.. నిహారిక కొణిదెల భావోద్వేగం!



'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి మరో అరుదైన గౌరవం దక్కింది. 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో ఈ సినిమా టీమ్ అవార్డును అందుకుంది. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు పురస్కారాలు అందజేశారు.'కమిటీ కుర్రోళ్లు' నిర్మాత నిహారిక కొణిదెల, దర్శకుడు యదు వంశీ, మేకప్ ఆర్టిస్ట్ రవి కుమార్ పసుపులేటి రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా పింక్ ఎలిఫెంట్ టీమ్ ఆనందం వ్యక్తం చేసింది. అవార్డు అందుకున్న క్షణాలను సోషల్ మీడియాలో పంచుకుంటూ.. ఇది తమ టీమ్‌కు గర్వకారణమైన, భావోద్వేగంతో కూడిన రోజని పేర్కొంది. ఇక 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల వేడుకలో పలువురు ప్రముఖులు అవార్డులు అందుకున్నారు. ఉత్తమ నటులుగా మమ్ముట్టి ('భ్రమయుగం'), కార్తిక్ ఆర్యన్ ('చందూ ఛాంపియన్') పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ నటిగా యామీ గౌతమ్ ('ఆర్టికల్ 370') అవార్డు దక్కించుకున్నారు.దిగ్గజ నటుడు అనంత్ నాగ్‌కు ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును ప్రదానం చేశారు. 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా పురస్కారం అందుకుంది. దర్శకుడు నాగ్ అశ్విన్, నిర్మాత అశ్వినీదత్ ఈ అవార్డును స్వీకరించారు. 'పుష్ప 2' చిత్రంతో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా సుకుమార్ అవార్డు అందుకున్నారు. 'కెప్టెన్ మిల్లర్'తో ధనుష్‌కు స్పెషల్ మెన్షన్ దక్కింది. 'పుష్ప 2'కు ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్లుగా దీపాలి నూర్, సీతల్ శర్మ పురస్కారాలు అందుకున్నారు.

# 'ఆదర్శ కుటుంబం' విడుదల వాయిదా..
# వెంకటేశ్ మూవీ వచ్చేది అప్పుడే!

వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం – హౌస్ నెం.47'. ఈ సినిమా విడుదల తేదీ మారింది. తొలుత అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం భావించింది. తాజాగా విడుదలను వారం రోజులు వాయిదా వేసింది. అక్టోబరు 9న సినిమాను థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ ప్రకటించింది. కుటుంబ అనుబంధాలకు యాక్షన్ అంశాలను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. వెంకటేశ్ పాత్ర ఎలా ఉండబోతుందన్నదానిపై అభిమానుల్లోనూ ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తోంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ నటిస్తున్న తొలి చిత్రమిది కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. విడుదల తేదీ మారడంతో అభిమానులు అక్టోబరు 9 కోసం ఎదురుచూడాల్సి ఉంది.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.